
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జనగామ

గురువారం 23 అక్టోబరు 2025

5



చెరువులో చేప పిల్లలు వదులుతున్న మత్స్య సహకార సంఘం నాయకులు (ఫైల్)

ఇంకెప్పుడు చేపడతారు?

- జాడ లేని ఉచిత చేప పిల్లల పంపిణీ
- టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- జిల్లాలో 2.72 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం
- మించిపోతున్న అదును..
- నగదు బదిలీ అయినా చేపట్టాలని వినతి..
- స్పందించని సర్కారు..
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు
- జిల్లాలో 9 రిజర్వాయర్లు, 732 చెరువులు

రఘునాథపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో జాప్యంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం మాత్రం చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం టెండర్లను పిలిచేది. ఈసారి ఇంకా ఆ దిశగా అడుగులు వేయకపోవ డంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరాలకు సం బంధించి ఫిష్ సీడ్ పార్మర్లకు ప్రభుత్వం రూ.3.79 కోట్ల బకాయిలు చెల్లించలేదు. దీంతో 2025-26 సంవత్సరంలో ఉచిత చేప పిల్లల టెం డర్లకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. అదును దాటుతోందని.. కనీసం నగదు బదిలీ అయినా చేపడితే తామే చేప పిల్లల్ని కొనుగోలు చేసి పెంపకం చేపడతామని మత్స్యకారులు కోరుతున్నారు.

2.72 కోట్ల చేప పిల్లల లక్ష్యం..

జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి గతంలో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారమే ఈసారి కుడా రూ.3.13 కోట్లతో 2 కోట్ల 72 లక్షల 72 వేల చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువులు, కుంటలలో వదలాలని సర్కారు నిర్ణయించింది. అయితే టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. గతంలో చేప పిల్లల టెండర్ ప్రక్రియలో 35నుంచి 40మిల్లీమీటర్ల సైజులో చేప పిల్లలకు ఒక్కొక్కటి 61 పైసల చొప్పున, 80నుంచి 100 మిల్లీమీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలకు ఒక్కొక్కటి రూ.1.63 చొప్పున ధర నిర్ణయించారు. 35 నుంచి 40 మిల్లీమీటర్ల సైజు 1.29 కోట్ల చేప పిల్లలు, 80 నుంచి 100మిల్లీ మీటర్ల సైజు 1.43 కోట్ల చేప పిల్లలకు టెండర్లు పిలువనున్నారు. జిల్లా వ్యాప్తంగా 9 రిజర్వాయర్లు, 732 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో గత సంవత్సరం లాగానే, ఈ సంవత్సరం కూడా 2 కోట్ల 72 లక్షల 72 వేల చేప పిల్లలను పెంచాల న్నదే ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. కానీ ఆచరణలో మాత్రం తీవ్రజాప్యం చేస్తోంది. జిల్లా లో 169 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 141 పురుషుల సహకార సం ఘాలు, 28 మహిళ సహకార సంఘాలు ఉన్నాయి. 169 సంఘాల్లో 16,868 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. చెరువులు, కుంటల్లో వే సే చేప పిల్లలు నిబంధనల మేరకు 35 ఎంఎం నుంచి 40 ఎంఎం, రిజర్వాయర్‌లలో వేసే చేప పిల్లలు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం సైజు ఉండాలి.

ఉసేలేని టెండర్లు..

గతంలో చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను మే. జూన్ నెలలలోనే అధికా రులు నిర్వహించేవారు. టెండర్లలో చేప పిల్లల పంపిణీ కాంట్రాక్టును పొందిన వారు ఆగస్టు చివరి వారం, సెప్టెంబరు మొదటి వా రం లోపే చేప పిల్లలను చెరువులలో వదిలేవారు. దీంతో చేప పిల్లల ఎదు గుదల ఆశించిన స్థాయిలో ఉండేది.

ఆలస్యమైతే చేప పిల్లల ఎదుగుదల కష్టమే
- నీల ఆగయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ఆశ్వరావుపల్లి



చేప పిల్లలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేస్తే వాటి ఎదుగుదల కష్టంగా ఉంటుంది. ప్రభుత్వం సకాలంలో చేప పిల్లల పంపిణీ కి పూనుకోవాలి. ఇప్పటికే అదను దాటిపోయింది. ఈనెలఖరు వరకైనా పంపిణీ చేయాలి.

నగదు బదిలీ చేస్తేనే మంచిది..
వై.బాలనర్సయ్య, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, నిడిగొండ



ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్లు రానందున, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ప్రభుత్వం నగదు బదిలీ చేయాలి. దీంతో నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేస్తే దిగుబడి పెరిగే అవకాశముంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు
ఎన్.రాణా ప్రతాప్, జిల్లా మత్స్య శాఖ అధికారి



ప్రభుత్వ ఆదేశాల మేరకు చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. జిల్లాకు 2.72కోట్ల చేప పిల్లల అవసరం ఉంది. చేప పిల్లలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఆలస్యం అవుతున్న విషయం వాస్తవం. నవంబరు మొదటి వారంలో చేప పిల్లలు పంపిణీ చేసే అవకాశం ఉంది.

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- జీడికల్‌లో వచ్చేనెల 4 నుంచి 17 వరకు వేడుకలు
- అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జీడికల్ గుట్టపై గుండాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

లింగాలఘణపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుప్రసిద్ధ జీడికల్ వీరాచల సీతారామచంద్రస్వామి కార్తీక మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి జీడికల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలన్నారు. నవంబరు 4 నుంచి 17 వరకు జరిగే వేడుకలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, గ్రీనరీ కార్యక్రమాలను నవంబరు 3లోగా పూర్తి చేయాలన్నారు. జీడికల్ గ్రామం నుంచి వచ్చే భక్తుల కోసం 7మీటర్ల వెడల్పుతో ఇంటర్ లింక్ సీసీ రోడ్డును నిర్మాణం చేయాలని, (మిగతా 8వ పేజీలో)

రైతులకు సర్కారు అండ

- మద్దతు ధర కల్పించడమే ధ్యేయం
- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు: 8లో

మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సభ్యసాచి ఘోష్

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి ఆరు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

వివరాలు 7లో

ప్రసవాల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్‌వో మల్లిఖార్జున్‌రావు



ప్రభుత్వాస్పత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

జఫర్‌గడ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) మల్లిఖార్జున్‌రావు వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ నరేందర్‌తో కలిసి డీఎంహెచ్‌వో బుధవారం జఫర్‌గడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలు, చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. డీపీహెచ్ఎఫ్‌డబ్ల్యూ, టీవీవీపీ సిబ్బంది, వైద్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. గత నెలలో ఆస్పత్రిలో కేవలం రెండు ప్రసవాలు జరగడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రసవాలపై గ్రామాల్లో చైతన్యవంతం చేసి సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అందరూ సమన్వయం, సహకారంతో బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. విధులపై అలసత్వం వహించరాదన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కమల్‌హాసన్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడీవో



ఏటీడీవో హసీనాబేగంతో ఉపాధ్యాయులు

జనగామ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జనగామలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను హన్మకొండ, జనగామ ఏటీడీవో హసీనాబేగం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అన్ని తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రెండు తరగతి గదులను పరిశీలించి త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బాత్రూంలు, మరుగుదొడ్లు, నీటి లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొని హాస్టల్ వార్డెన్ హరిచంద్‌కు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పేదరికం పోవాలంటే విద్య తప్ప మరో మార్గం లేదన్నారు. శ్రద్ధతో, క్రమశిక్షణతో చక్కటి విద్యను అభ్యసించాలన్నారు. ఏటీడీవోగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా పాఠశాలకు వచ్చిన ఏటీడీవోను హెచ్ఎం లచ్చిరాంతో సహా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి.వాసు, ఉపాధ్యాయులు జయరాం, రాములు, పరశురాం, శత్రు, ఉపేందర్, కవిత, స్వాతి, భిక్కు, రవికుమాంర్ పాల్గొన్నారు.

సాధువుల వేషంలో హల్‌చల్

- బ్యాంగిల్ స్టోర్ యజమానురాలిపై పౌడర్ చల్లి.. డబ్బులు లాగిన సాధువులు..
- కారులో పారిపోతుండగా పట్టుకున్న వ్యాపారులు
- రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నలుగురి గుర్తింపు
- విచారించి, సొంత పూచికత్తుపై విడుదల చేసిన పోలీసులు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

వివరాలు: 6లో



పోలీస్‌స్టేషన్ ఆవరణలో సాధువులు



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న అడిషనల్ డీఆర్డీవో కృపాకర్

నర్సరీలలోని మొక్కలను సంరక్షించాలి

అడిషనల్ డీఆర్డీవో కృపాకర్

వెంకటాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలోని మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ములుగు అడిషనల్ డీఆర్డీవో కృపాకర్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని 10గ్రామపంచాయతీలలో గల నర్సరీలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన ప్రతి గ్రామంలో పెద్దమొక్కలు, చిన్న మొక్కలు ఎన్ని ఉన్నాయి, హోంసీడ్ ఎన్ని ఇచ్చారు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో ఎన్ని మొక్కలు నాటారనే విషయాలను పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. వెంకటాపూర్, ఎల్లారెడ్డిపల్లి, నల్లగుంట, లక్ష్మీదేవిపేట, నర్సింగాపూర్, లక్ష్మీపురం, బూర్గుపేట, అడవిరంగాపూర్, మల్లయ్యపల్లి, చక్రవర్తిపల్లి గ్రామాల్లో ప్రతి నర్సరీని పరిశీలించానని అన్నారు. ఈ నర్సరీలలో మొక్కలను పిప్పింగ్, గ్రేడింగ్‌తోపాటు వచ్చే సంవత్సరంలో ఏమైనా మొక్కలు పనిచేస్తాయా లేదా అని పరిశీలించానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలందరికీ ఈ-కేవైసీ చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో మాలోతు రాజు, ఈసీ జనగాం సురేష్, టీఏ ఎ.సురేష్, పంచాయతీ సెక్రటరీలు నాగరాజు, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి



క్రీడాకారుడు చరణ్

కాటారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ (బాలుర) గురుకుల కళాశాలకు చెందిన సున్నం చరణ్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరా బాద్‌లోని పఠాన్‌చెరులో ఈ నెల 16-18 వరకు జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టులో ఆడిన చరణ్ అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జైపాల్, జిల్లా పెటా సంఘం అధ్యక్షుడు రమేష్, కాటారం జోన్ సెక్రటరీ విజయలక్ష్మి, మండల కన్వీనర్ రాధ తెలిపారు. బుధవారం గురుకులంలో జాతీయ స్థాయికి ఎంపికైన చరణ్‌ను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ మంథెన శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తాడ్వాయి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం జంపన్న వాగు లోని లోతట్టు ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మ లను దర్శించుకోవడానికి తరలివచ్చే భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాల ఆచరించే సమయంలో లోతట్టు ప్రాంతాలకు వెల్లకూడదని సూచించారు. భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన బీవోటీల వద్ద పుణ్యస్నానాలు ఆచరించాలని అన్నారు. వర్షాకాలం వచ్చిన వరదలకు వాగులో కోతకు గురై లోతట్టు గుంతలు ఏర్పాడ్డాయన్నారు. భక్తులు హెచ్చరికలను గుర్తించి ప్రమాదాలను నివారించడానికి సహకరించాలని కోరారు.

సాధువుల వేషంలో హల్‌చల్

బ్యాంగిల్ స్టోర్ యజమానురాలిపై ఫౌడర్ చల్లి.. డబ్బులు లాగిన సాధువులు

కారులో పారిపోతుండగా పట్టుకున్న వ్యాపారులు

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధువుల వేషధారణలో వచ్చిన నలుగురు వ్యక్తులు బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో హల్‌చల్ చేశారు. పలు షాపులు తిరిగి రుద్రాక్షలు, శాంతి పూజలు చేస్తే లాభాలు వస్తాయని నమ్మించే ప్రయత్నం చేశారు. ఓ బ్యాంగిల్ స్టోర్ యజమానురాలిపై పౌడర్ చల్లి డబ్బులు తీసుకోవడంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని సిరోయి పట్టణానికి చెందిన అనాపంథ్, వంచొడ్‌నాథ్, రూప్‌నాథ్, రమేష్‌నాథ్‌లు సాధువుల వేషంలో డ్రైవర్ సాయంతో కారులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకున్నారు. పట్టణంలోని పలు షాపుల వద్దకు వెళ్లి శాంతిపూజలు నిర్వహిస్తే వ్యాపారం లాభసాటిగా సాగుతుందని యజమానులకు నమ్మించారు. వారికి రుద్రాక్షమాలలు ఇచ్చే ప్రయత్నం చేసినా యజమానులు నమ్మక నిరాకరించారు.

అయితే రైల్వేగేట్ సమీపంలోని ఆయిమాత బ్యాంగిల్ స్టోర్‌లోకి ఇద్దరు సాధువులు వెళ్లగా, మరో ఇద్దరు కారులోనే డ్రైవర్‌తోపాటు ఉన్నారు. షాపులోకి వెళ్లిన సాధువులు యజమాని తారామాతతో మాట్లాడి తమకు సాయం చేయాలని కోరగా యాభై రూపాయలు ఇచ్చింది. తమ వద్ద రుద్రాక్ష తీసుకుని, శాంతిపూజ చేస్తే వ్యాపారంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఇంతలోనే వారి వెంట తెచ్చుకున్న ఒక రకమైన పౌడర్‌ను ఆమెపై చల్లారు. దీంతో ఆమె ఇప్నాటైజ్‌గా మారి సాధువులు చెప్పినట్లు వింటూ రూ.500 చొప్పున రెండుసార్లు ఇచ్చింది. షాపులోంచి సాధువులు ఎంతకీ బయటకు రాకపోవడంతో గమనించిన ఎదురుగా మరో షాపులో ఉన్న తారామాత సోదరుడు దిలీప్ షాపువద్దకు వచ్చి సాధువులను ప్రశ్నించాడు. దీంతో భయపడిన సాధువులు సమీపంలో ఉన్న కారులో ఎక్కి పారిపోయే ప్రయత్నం చేశారు.



పారిపోతున్న సాధువులను అడ్డుకొని నిలదీస్తున్న వ్యాపారులు

చుట్టుపక్కల వ్యాపారులు కారుకు అడ్డుపడి కారులో నుంచి స్వాములను కిందకు దించి నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడికి చేరుకొని సాధువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌లో వారిని సాధువులను విచారించి బ్యాంగిల్ షాపు యజమాని వద్ద నుంచి వసూల్ చేసిన డబ్బులు రూ.1,250 నగదును వారికి ఇప్పించారు. సాధువులు వెంట తెచ్చుకున్న ఫౌడర్‌ను పరిశీలించి పడవేయించారు. సీఐ జి.వేణు సాధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి, అడ్రస్‌లు, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొని సొంత పూచికత్తుపై సాధువులను పంపించారు.

దామెరకుంట ఎస్సీ గురుకులంలో డీసీవో విచారణ

కాటారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెరకుంట సాంఘీక సంక్షేమ బాలికల గురుకులాన్ని డీసీవో బిక్షపతి, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ బుధవారం సందర్శించారు. ముగ్గురు ఆరో తరగతి విద్యార్థినుల గొంతులపై గాట్లు పడిన సంఘటనపై విచారణ చేశారు. ఆరు రోజుల క్రితం విద్యార్థులంతా రాత్రి పూట పడుకున్న సమయంలో జరిగిన సంఘటనపై ఓ విద్యార్థిని తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. గురుకులంలో ఏం జరిగిందనే దానిపై డీసీవో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, హౌస్ టీచర్, పలువురు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గొంతులపై గాట్లు పడ్డ ముగ్గురు విద్యార్థినులు దీపావళి పండుగ కోసం ఇంటికి వెళ్లి ఇంకా రాకపోవడంతో వారితో మాట్లాడే అవకాశం రాలేదని డీసీవో తెలిపారు.

ఈ సంఘటనపై టీచర్లు, విద్యార్థులు చెప్పిన విషయాలతో విద్యార్థుల మధ్య జరిగిన చిన్న తగాదాలతో పెన్సిల్ చెక్కే షార్ప్‌నర్‌తో విద్యార్థినుల గొంతులపై గీకినట్లు తెలుస్తోందన్నారు. పిల్లల మధ్య మాటల సందర్భంగా ఏర్పడ్డ గొడవలను టీచర్లు తెలుసుకోవడంలో కొంత ఆలస్యం కావడంతో ఈ గందరగోళం నెలకొందని, విద్యార్థులంతా బాగానే ఉన్నారని డీసీవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, పలువురు టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, టీచర్లతో మాట్లాడుతున్న డీసీవో భిక్షపతి, ఏఈ రాజశేఖర్

31న యువ కళాకారుల ఎంపిక

జనగామ కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యువజనోత్సవాలను పురస్కరించుకొని 31న జిల్లా స్థాయి యువ కళాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కెకోదండరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు అభ్యర్థులు 31న స్థానిక జూబ్లీ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జానపద నృత్యం, జానపద పాటలు (గ్రూప్, కథా రచన (హిందీ/ఇంగ్లీషు/తెలుగు), పెయింటింగ్, ఉపన్యాసం (హిందీ/ఇంగ్లీషు), కవిత్వం (హిందీ/ఇంగ్లీషు), ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళాలో పోటీలు నిర్వహించబడతాయన్నారు. వివరాలకు 96521 97323, 9182552593 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన లీగల్ సర్వీస్ సెక్రటరీ



కొర్కిశాల కేజీబీవీలో స్టోర్ రూంను పరిశీలిస్తున్న అథారిటీ సెక్రటరీ పంచాక్షరి

మొగుళ్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే, కొర్కిశాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ చిలుకమరి పంచాక్షరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వంట గదులు, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఏలక్ష్యం కోసం ఎదురుచూస్తున్నారో ఆలక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఉన్నతమైన చదువులు చదివి మీ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పీఎల్‌వీ మంగళపల్లి శ్రీనివాస్, ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు ఇవ్వాలి

జిల్లా ఉప వైద్యాధికారి విపిన్ కుమార్

ములుగు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగాలపల్లి ఆయుష్మాన్ మందిర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం జిల్లా ఉప వైద్యాధికారి విపిన్ కుమార్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలను చిన్న పిల్లలకు సకాలంలో ఇవ్వాలని, టీకాల ప్రాముఖ్యతను పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, వ్యాధి నిరోధక టీకాల వివరాలను యూవీన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, వ్యాధి నిరోధక టీకాల డ్యూలిస్టును టీకాలు ఇచ్చిన అనంతరం ఎంసీఎచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. అనంతరం వైద్య సేవలకై వచ్చిన గర్భిణుల రిపోర్టులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ఏఎన్‌సీ క్లీనిక్ నిర్వహించాలని, వ్యాధి నిరోధక టీకాల, తల్లిపాలు, పోషక ఆహారం, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల వల్ల కలిగే లాభాల ప్రాముఖ్యతను తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణదీర్, తల్లి ఆరోగ్యం, పోషకాహార జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శీకాంత్, డెమో సంపత్, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్ నవ్యారాణి, ఆరోగ్య కార్యకర్తలు రమ, లత, ఆశా కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ మందిర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న విపిన్ కుమార్

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వెంకటాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాణ్యతమైన విత్తనం- రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో రైతులు సాగుచేస్తున్న డబ్ల్యూజీఎల్-962 రకం వరి, విర్చి పంటలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎ.విజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు బీవీ.రాజ్‌కుమార్, బి.సౌందర్య బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరికంకి పాలు పోసుకోవడం, గింజనిండే దశలో ఉందన్నారు. వరిలో కంకినల్లి, గింజమచ్చ తెగులును గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు స్పైరోమెసిఫిన్ ఒక మిల్లీలీటర్ లీటర్ నీటిలో, ప్రాపికోనజోల్ ఒక మిల్లీలీటర్ లీటర్ నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలన్నారు.

అదేవిధంగా మిరప పంట శాఖీయ దశలో ఉందని, మిరపలో వేరుకుళ్లు తెగులు, ఆకుముడత ప్రధాన సమస్యగా ఉన్నాయని, వేరుకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందు మూడు గ్రాములు లీటర్ నీటిలో కలుపుకుని మొదలు బాగా తడిసేలా పిచికారీ చేయాలని అన్నారు. ఆకుముడత నివారణకు, తెల్లదోమలను అరికట్టడానికి ఎకరాకు 15నుంచి 20 పసుపురంగు జిగురు అట్టలను, తామర పురుగుల నుంచి కాపాడుకోవడానికి 20నుంచి 30 నీలంరంగు జిగురు అట్టలను పొలమంతటా అమర్చుకోవాలన్నారు. రసం పీల్చే పురుగు నివారణకు ఫిప్రోనిల్ రెండు మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి

బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్ అన్నారు. భూపాలపల్లిలోని తెలంగాణ ప్రజాఫ్రంట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ ఈశ్వరయ్య, ఐఏఎస్ అధికారి చిరంజీవులు, డాక్టర్ విశారధన్ మహారాజ్‌ల నాయకత్వంలో బీసీ రిజర్వేషన్ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్ మేరకు ఈ నెల 24న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. విలేకరుల సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గట్ల రాజన్న, కన్వీనర్లు జోగు బుచ్చయ్య, బర్ల గట్టయ్య, క్యాతరాజు సాంబమూర్తి, సభ్యులు తాటికంటి రవి, కొండపర్తి ఇస్తారీ, గట్టయ్య, పూర్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్

బైక్- ఆయిల్ ట్యాంకర్ ఢీ..

● ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

● బచ్చన్నపేట మండలంలో ఘటన



రాజేందర్‌రెడ్డి(ఫైల్)

బచ్చన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన దారులను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఒక రు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం జనగామ జిల్లా బచ్చన్నపేట-ఆలేరు ప్రధాన రహదారిపై కొలనుపాక, పోచన్నపేట గ్రామాల మధ్య చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ హమీద్ కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని బండనాగారంనకు చెందిన నల్ల రాజేందర్‌రెడ్డి(23), ఈదులకంటి రమేష్‌రెడ్డిలు పాల బిల్లులు తెచ్చేందుకు చేర్యాలకు వెళ్లారు. అనంతరం ఆలేరు వైపు బైక్‌పై వెళ్తుండగా, ఆలేరు నుంచి బచ్చన్నపేట వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్ల వసంత- చంద్రారెడ్డిల కుమారుడు రాజేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, రమేష్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రమేష్‌రెడ్డిని జనగామకు తరలించగా, పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ అబ్దుల్ హమీద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. అవివాహితుడైన రాజేందర్ కూలీనాలీ చేసుకుని జీవిస్తుండగా, రమేష్‌రెడ్డి పాల కేంద్రంలో పనిచేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో బుధవారం జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈరెల్లి ఎల్లమ్మ (60) నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, పాలకుర్తి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపు మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు చెరిపల్లి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భర్త గతంలోనే మృతిచెందగా, సంతానం లేకపోవడంతో సోదరుడి ఇంటివద్ద ఉంటోంది. ఎల్లమ్మ మృతితో విషాదం నెలకొంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆలుబాక, వెంకటాపురం మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభిచి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఏగ్రేడ్ రకం క్వింటాకు 2389, కామన్ రకానికి రూ.2369 ఉందని, సన్నాలకు అదనంగా క్వింటాకు రూ.500బోనస్ అందించడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

వెంకటాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ లక్ష్యసాధనకు కృషి చేయాలని కాఫేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూర్థురాజు అన్నారు. యువత విద్యను మెరుగుపరచుకోవడంపై ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సుకు ఆయన హాజర య్యారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై శ్రద్ధగా చదువుకోవాల న్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, సభ్యులు కామేష్, భాస్కర్, ఉష, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ఆస్ట్రేలియాలో ఒరికా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

● దిగ్గజ సంస్థ ఒరికాకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

మహదేవపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ ఒరికా ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న సంస్థ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు పెట్టడానికి అనువైందని చెప్పారు. దీనిపై సంజీవ్ రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఒరికా సంస్థ సీఈవో ఎండి.సంజీవ్ గాంధీ తెలిపారు.ఆస్ట్రేలియాకు విచ్చేసిన శ్రీధర్‌బాబును కంపెనీ ప్రతినిధులు సన్మానించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వెంకటాపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యువకుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 22 ఏళ్ల యువకుడు పదేళ్ల బాలికను స్కూల్ వద్ద దింపుతానంటూ బైక్‌పై తీసుకెళ్లి ఎవరూ లేని సమయంలో గ్రామ శివారు వద్ద అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తప్పించుకొని పారిపోయి ఇంటికి చేరుకుంది. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా యువకుడిపై పోక్సో కేసు నమోదైంది.

వరిలో 'గేమ్ ఛేంజర్'

- కల్వలలో ప్రయోగాత్మకంగా 'డీఆర్ఆర్ ధాన్ 75' సాగు
- వరి పరిశోధన సంస్థ రూపొందించిన కొత్త వంగడం
- గాలివాన, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి ప్రత్యేకత
- ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల చొప్పున గింజల వృద్ధి
- విత్తనం కోసం రైతుల నుంచి డిమాండ్

కేసముద్రం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరి రకాల్లో తక్కువ ఎత్తుతో గాలివానను, తెగుళ్లను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే గేమ్‌ఛేంజర్‌లాంటి వంగడాన్ని కేసముద్రం మండలం కల్వలలో ప్రైవేటు డిగ్రీ జంతు శాస్త్ర లెక్చరర్, రైతు చల్లా వెంకటేషం ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాడు. హైద రాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ తొమ్మిదేళ్లు పరిశోధించి రూపొందించిన ఈ వంగడం విత్తనాలకు రైతుల్లో విపరీత మైన డిమాండ్ ఉంది. ఇంకా మార్కెట్లోకి వాణిజ్యపరంగా ఈ విత్తనాన్ని సంస్థ విడుదల చేయలేదు. ఈ ఏడాది మే నెలలో ఆ సంస్థ నుంచి ఒక కిలో విత్తనం సంచి రైతు వెంక టేషానికి ఉచితంగా అందించారు. ఈ విత్తనాన్ని తనకున్న వరిలో ఐదు గుంటల్లో ఒక్కో పిలక చొప్పున నారును నాటి సాధారణ వరిలాగే సాగు చేశాడు. తక్కువ ఎత్తుతో వరికం కులకు విపరీతమైన గింజలతో ప్రస్తుతం ఈ రకం కోత దశకు వచ్చింది. బీపీటీ రకంలాగా ఉంటూ ఎత్తుతక్కువగా, తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడి ఇచ్చే విధంగా వంగ డాన్ని తయారు చేసినట్లు ఆ సంస్థ శాస్త్రవేత్తలు చెబుతు న్నారు.

ఈ వరిలో అన్నీ విశేషాలే...

'డీఆర్ఆర్ ధాన్ 75' రకం వరి వంగడంలో అన్నీ విశే షాలే. ఈ రకం వరి ఎత్తుతక్కువగా ఉండడం వల్ల సాధా రణ రకం వరిలాగే గాలివానకు త్వరగా నేలవాలిపోవు. ఒక వరిమొక్క నాటగా 10 నుంచి 12 పిలకలు చొప్పున ఏర్పడి ఒక్కో వరికంకికి 300 నుంచి 450 గింజలు వేయడం విశేషం. సాధారణ బీపీటీ రకంలోనైతే 150 నుంచి 200 గింజలు ఉంటాయి. ఈ రకం అగ్గితెగులు, ఎండుతెగులు తట్టుకునేలా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బీటీపీ రకం వరి అయితే వెయ్యి గింజల బరువు 12 నుంచి 13.5గ్రాములు ఉండగా ఈ రకం వరిలో వెయ్యి గింజల బరువు 16 గ్రాములు వస్తోంది. వెంకటేషం సాగు చేసిన ఐదు గుంటల వరిలో ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా గింజలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఈ లెక్కన ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి చొప్పున వస్తున్నట్లుగా వెంకటేషం చెబుతున్నారు. అన్నీ విశేషాలే ఉన్న ఈ రకం వరికి విపరీతంగా డిమాండ్ ఉండడంతో రైతులు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ వరిధాన్యాన్ని తిరిగి విత్తనాలుగా ఉపయోగించే అవకాశం ఉండడంతో కిలో విత్తనాలను రూ.100 నుంచి రూ.150 చొప్పున ప్రయో గాత్మకంగా సాగు చేసిన కొన్ని ప్రాంతాల్లోని రైతులు విక్ర యిస్తుండడం గమనార్హం. ఏదేమైనా వరి వంగడాల్లో విప్ల వాత్మక మార్పును తీసుకువస్తూ, తెగుళ్లను, గాలివానను తట్టుకొని రెట్టింపు దిగుబడి నిచ్చే ఈ రకం విత్తనాన్ని వరిలో 'గేమ్‌ఛేంజర్'గా పలువురు రైతులు భావిస్తున్నారు.


కల్వలలో సాగు చేస్తున్న డీఆర్ఆర్ ధాన్ 75 రకం వంగడం పొలంలో అధికంగా వేసిన వరిగొలుసులు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నతాధికారులు

మేడారం జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్
- హైదరాబాద్‌లో ములుగు కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ములుగు జిల్లాలోనరి మేడారం సమ్మ క్క-సారలమ్మ మహాజాతర ఏర్పాట్లు పకడ్బం దీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. హైదరా బాద్‌లోని సచివాలయంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆయా శాఖల ఉన్నతా ధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతర ఏర్పాట్లను 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్-3 జంపన్నవాగు ప్రాంతంగా నిర్ణయించి నట్లు తెలిపారు. మహాజాతర సమయంలో 10 నుంచి 12 వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటారని, ప్రతీ జోన్‌ను ఒక జోనల్ ఆఫీ సర్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 24శాశ్వత టవర్లు, 20 సెల్ఆన్‌వీల్స్ 350 వైఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 49 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి 6 లక్షల వాహనాలు నిలిపే సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లు నవంబరు 30 నాటికి పూర్తవుతాయన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో 33 ఫారెస్టు రోడ్లను అభివృద్ధి చేయనున్నామని అన్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువ రీలోని రహదారులను కూడా అభివృద్ధి చేయ నున్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, రూ.92 కోట్లతో ప్రధాన రహదారులను నిర్మించ నున్నట్లు తెలిపారు.

జాతర సమయానికి ముందు, మధ్య, తర్వాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు పేర్కొ న్నారు. జంపన్నవాగు వద్ద తాత్కాలిక రహ దారి కూలిపోయిన కారణంగా మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని, 517 బోరుపాయింట్లు, 250 కిలోమీటర్ల రహదారు లపై లైటింగ్ పనులు జరుగుతున్నాయని అన్నారు. స్థానికుల సహకారంతో ఆరు స్లాటర్ సెంటర్లు ఏర్పాటయ్యాయని, జంపన్నవాగు పునరుద్ధరణ పనులు సాగుతున్నాయని పేర్కొ న్నారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ ఫార్మర్లు అమర్చే పనులను విద్యుత్‌శాఖ చేప ట్టిందని, జాతర ప్రాంతమంతా ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతాయని వివరించారు. అన్ని శాఖలు సమన్వయంలో పనిచేసి మేడారం సమ్మక్క-సారలమ్మల మహా జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జా దవ్, విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి, సమా చార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేటలో నేతకానిల కోలాహలం

- సందడిగా జోడెద్దుల విగ్రహాల నిమజ్జనం
- కోలాటం, ఆటపాటలతో ఊరేగింపు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

హసన్‌పర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోనే వినూత్నంగా మూడు రోజుల పాటు నిర్వ హించే సీతంపేట నేతకాని కులస్థుల దీపావళి బతు కమ్మ వేడుకలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం నేతకానీల కుటుంబ సభ్యులంతా కేదారీ శ్వరస్వామి వ్రతం నోముకొని జోడెద్దుల విగ్రహాలకు పిండివంటలతో చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వ్యవసాయం సజావుగా సాగాలని, అధిగ దిగుబడులు రావాలని, పిల్లాపాపలను చల్లగా ఉండాలని వేడుకున్నారు.


జోడెద్దుల విగ్రహాలను ఊరేగిస్తున్న నేతకాని కులస్థులు

జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం

మూడు రోజుల పాటు జరిగే ఈ దీపావళి బతుకమ్మ వేడుకల్లో బుధవారం పురుషుల ఘట్టం ప్రారంభమైంది. కేదారీశ్వర వ్రతం ముందు ఏర్పాటు చేసిన జోడెద్దుల ప్రతిమలకు ప్రత్యేకంగా అలం కరించిన నగలతో కూడిన ప్రతిమలను తీసుకొని కోలాటంతో ఊరే గింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) రంగులు చల్లుకొని జోడె ద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగరిత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన నేతకాని కులస్థులు ఈ వేడుకల్లో పాల్గొని తమ కుటుంబ సభ్యులతో సంబురంగా గడి పారు. పురుషుల కోలాటం, పాటలు గ్రామస్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, ఎంపీ టీసీ మాజీ సభ్యురాలు బండారి రజిత చేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, గోళ్ల రాజయ్య, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వేడుకలు

నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు మూడోరోజు గురువారం ముగియనున్నాయి. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నేతకాని కులస్థులు మాత్రమే ఈ వేడుకలు దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకుంటారు. ఈ ప్రాంత నేతకాని కులస్థులు స్త్రీ, పురుషులు వేర్వేరుగా జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలకు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన నేత కాని కులస్థులు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో సీతంపేటకు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ పండుగను నేతకాని కులస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.


పాటలు పాడుతున్న నేతకాని కుల పెద్దలు


కుంట వద్ద జోడెద్దుల విగ్రహాలకు హారతి ఇస్తున్న నేతకాని కులస్థులు

రేపు కేయూలో కాళోజీ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు 9వ ఎండోమెంట్ లెక్చర్ అక్టోబరు 24న శుక్రవారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ఎనుగు నరసింహరెడ్డి హాజరై 'సాయుధ పోరాటం, తొలిమలిదశ ఉద్యమాలు :కవిత్వం' అనే అంశంపై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులతో పాటు ఉద్యోగులందరూ హాజరుకావాలని రిజిస్ట్రార్ రామచంద్రం కోరారు.

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఏ పరీక్షలు

- ఈనెల 24 నుంచి ప్రారంభం.. అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా పరీక్షల బోర్డు ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఈవో వాసంతి



హనుమకొండ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 (ఎస్ఏ) పరీక్షలు ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయని హనుమకొండ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీ ఈబీ) చైర్మన్, జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, డీసీఈబీ కార్యదర్శి బి.రాంధన్‌లు తెలిపా రు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వతరగతి వరకు విద్యా భ్యాసం చేస్తున్న ప్రతీ విద్యార్థి పరీక్షలకు హాజరవుతారని తెలిపా రు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డుకు ఫీజు చెల్లించిన ప్రకారం 6వతరగతి నుంచి 10వతరగతి వరకు 56,194 మంది విద్యార్థులు, 1వ తరగతి నుంచి 5వతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 14,646 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వీరిలో తెలుగు మాధ్యమంలో 200, ఇంగ్లీష్‌లో 14,097, ఉర్దూలో 349 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో 267, ఇంగ్లీష్‌లో 55,766, ఉర్దూలో 161మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నా రు. ప్రభుత్వం నిర్ణయించిన టైం టేబుల్‌ను అనుసరించి అన్ని యాజమాన్యాలు హనుమకొం డ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సరఫరా చేసిన ప్రశ్నపత్రాలతోనే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల నిబంధనలు ఉల్లంఘించినట్లయితే నియమావళి 25 (1997) చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండల విద్యాధికారుల నుంచి పరీ క్షకు ఒక రోజు ముందుగా ప్రధానోపాధ్యాయులు ప్రశ్నపత్రాలు తీసుకొని వెళ్లి సీనియర్ ఉపా ధ్యాయుడు జాయింట్ కస్టోడియన్‌గా ప్రశ్న పత్రాలను పాఠశాలలో భద్రపరచాలని కోరారు. మండల విద్యాధికారులు ఎంఎస్ఓలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాలని కోరారు.

మార్కెట్ అంటే లెక్కలేదా!?

- నిర్వహణను గాలికి వదిలేసిన ప్రభుత్వం
- పూర్తిస్థాయి కార్యదర్శి లేక ఇబ్బందులు
- మూడేళ్లుగా పాలకవర్గం ఖాళీ
- మద్దతు ధర, మౌలిక సదుపాయాలు నిల్
- సమస్యలతో సతమతమవుతున్న రైతులు
- ఇటువైపు కన్నెత్తి చూడని పాలకులు
- అధ్వాన స్థితిలో ఏనుమాముల మార్కెట్

వరంగల్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యో తి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. అంతటి పేరున్న ఈ మార్కెట్ ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. కొన్నే ళ్లుగా పాలకులు పట్టించుకోకపోవడంతో అ నేక సమస్యలతో సతమతమవుతోంది. పా లకవర్గం లేదు.. కార్యదర్శి లేడు.. తగినంత సిబ్బంది లేరు.దీంతో మద్దతు ధరలు పట్టిం చుకున్నవారు లేకుండాపోయారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు సమస్యలను ఎవరి కిచెప్పుకోవాలో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో అందరిలో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. ముఖ్యంగా రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే దారం తెగిన గాలిపటంలా తయారైంది మార్కెట్ పరిస్థితి.



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్..

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌కు ప్రభుత్వం కార్యదర్శిని నియ మించలేదు. పోలెపాక నిర్మల సస్పెన్షన్‌కు గురైన తరువాత ఆ స్థానంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్యాకు అదనపు బాధ్యతలను కట్టబెట్టారు. ఆయన ఇటీవల నెల రోజుల పాటు లీవ్ పెట్టారు. దీంతో గ్రేడ్ 2 కార్యదర్శి రాము అనధికారికంగా ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

పాలకవర్గం లేక మూడేళ్లు..

మార్కెట్‌కు పాలకవర్గం లేక దాదాపు మూడేళ్లు కావస్తోంది. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్లక్ష్యం చేసిందంటే.. కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చి రేండెళ్లు గడిచినా ఇంతవరకు అతీగతీ లేకుండా పోయింది. గత ఫిబ్రవరిలో పాలకవర్గాన్ని నియమించినప్పటికీ అది చెల్లనిరూపాయిగా మిగిలిపోయింది. పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల కోడ్ రావడం, మరోవైపు వర్గపోరు తెరపైకి రావడంతో అధిష్టానం ఈ విషయా న్ని కోల్డ్‌స్టోరేజీలో పెట్టింది. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు వ్యవసాయశాఖ మంత్రిగానీ, జిల్లా మంత్రి గానీ, ఎమ్మెల్యేలు గానీ పట్టించుకున్న పాపానపోలేదు.

సిబ్బంది కొరత..

మార్కెట్‌లో 119 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా కేవ లం 35మందితో నడిపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇరువై ఏళ్లగా మార్కెట్‌లో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ చేస్తుంటే ఖాళీలు ఏర్పడుతున్నాయే తప్ప కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేసింది లేదు. టార్గెట్లు పెట్టి మరీ మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్న ప్రభుత్వం మార్కెట్లో ఉద్యోగాల ను భర్తీ చేయడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అమలుకాని మద్దతు ధరలు

ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు మార్కెట్లో గిట్టు బాటు ధరలు పలుకడం లేదు. పత్తి, మక్కజొన్న, కందులు, పెసళ్లు, నువ్వులు, పల్లికాయ ఏ పంట తీసుకునాన క్వింటాళ్‌కు వంద నుంచి వెయ్యి రూపాయల వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు పత్తి సీజన్ మొదలైంది. సీసీఐ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికీ తేదీ నిర్ణయించకపోవ డంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించే వారేరి..?

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తో పాటు లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, ఇటీవల కొత్తగా ముస లమ్మకుంటలో ప్రారంభించిన మామిడి మార్కెట్.. ఇలా ఏ మార్కెట్లో చూసినా కనీస సౌకర్యాలు కనిపించడంలేదు. ఏకంగా మంత్రి కొండా సురేఖ, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఇచ్చిన హామీ లే అమలు కాలేదంటే పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

ఏనుమా ముల మార్కెట్ లో సీసీ కెమెరాలు కూడా లేవంటే ఇంతకంటే దురదృష్టకరమైన విషయం ఏమైనా ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్.నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి ఏను మాముల మార్కెట్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా రైతులు డిమాండ్ చేసున్నారు.

'కపాస్' యాప్ ద్వారా మద్దతు ధర

- రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా
- జిల్లా అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర పొందాలంటే ముందుగా కపాస్ కిసా న్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని రాష్ట్ర ఉద్యాన వన శాఖ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రొక్యూర్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ యాస్మీన్ బాషా పత్తి రైతులకు సూచిం చారు. బుధవారం ఆమె వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి తో కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిం చారు. అదేవిధంగా మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, వరంగల్ డీఏవో అనురాధ, హనుమకొండ డీఏవో రవీందర్ సింగ్, మార్కెట్ గ్రేడ్ 2కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్‌లతో కలిసి పత్తి యార్డులో పర్యటిం చారు. రైతులతో మాట్లాడి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లా డుతూ.. పత్తి నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని, గుడ్డి పత్తిని మంచి పత్తితో కలుపవద్దని, తద్వారా మంచి పత్తికి కూడా ధర రాకుండా పోతుందని అన్నారు. రైతులు గ్రామా లలోనే వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంట వివరా లతో పాటు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల న్నారు. పత్తి అమ్ముకోవాలి అన్నప్పుడు సెల్‌ఫోన్‌తో కపాస్ కిసాన్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వచ్చిన వెంటనే పత్తి కొనుగోలు చేస్తారని రైతులకు వివరించారు. అనం తరం మార్కెట్ పరిధిలోని శ్రీరాజ్ కాటన్ ఇండస్ట్రీ మిల్లును పరిశీలించారు. మిల్లు యజమా నితో మాట్లాడు తూ.. కపాస్ కిసాన్‌యాప్‌కు సంబధించిన సమాచారం తెలిసేలా పెద్దగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. కపాస్ కిసాన్ యాప్, స్లాట్ బుకింగ్‌పై రైతులకు పూర్తి అవగాహన కలిగించేలా గ్రామాలలో ప్రచారం చేయించాలన్నారు. వీడియో రికార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను దేశించారు. ఈ సంద ర్భంగా కాటన్ సెక్షన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, నాగభూషణం యాస్మీన్ బాషాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.


శ్రీరాజ్ పత్తి మిల్లును సందర్శించిన యాస్మిన్ బాషా, ఇతర అధికారుల బృందం

యాసంగి వేళ విత్తనాల ఎంపికే కీలకం

వర్ధన్నపేట అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంటలు ఇపుడిపుడే చేతికందుతుండగా మరో వైపు యాసంగి వరితోపాటు కంది, పెసర, కూరగాయలు, శనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇలాంటి సమ యంలో విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకో కుంటే నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విత్తనాల కొనుగోలులో అవలంబించాల్సిన విధానాలను వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్‌కు మార్ వివరించారు. నాణ్యమైన విత్తనాలు వంద శాతం జన్యు, 98 శాతం బాహ్య స్వచ్ఛత కలిగి ఉంటాయి. పంటను బట్టి 75 శాతం నుంచి 90 శాతం మొలకెత్తే శక్తి ఉంటుంది. ధాన్యంలో 10-12 శాతం, అపరాల్లో 8-9 శాతం తేమ ఉండేవాటిని కొనుగోలు చేయాలి. అంత ర్గత చీడపీడలు లేనివాటిని ఎంచుకోవాలి.

బిల్లులు తప్పనిసరి..

విత్తనాల కొనుగోలు చేసేటపుడు గుర్తింపు పొందిన సంస్థల నుంచి తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారు సంతకంతో పాటు విత్తన రకం, ఉత్పత్తి చేసిన సంస్థ పేరు, లాట్ నెంబర్ వంటి వివరాలు తప్పకుండా ఉండాలి. గడువు తేదీని పరిశీలించాలి. సీలు సరిగా లేకున్నా.. చిరిగినా లేదా పాడైన సంచులు, డబ్బాలను ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దు. వ్యవసాయశాఖ అనుమ తిలేని విత్తనాలను లైసెన్స్ లేని అపరిచిత వ్యక్తుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దు.

సంచులపై వివరాలు..

పరీక్ష చేసిన తేదీ నుంచి 9 నెలల కాల పరిమితి దాటినవి కొనుగోలు చేయవద్దు. ఆకుపచ్చ, నీలిరంగు ట్యాగ్ ఉంటేనే ధృవీకరించినవి అనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలి. ఆకుపచ్చ, తెలుపు రంగు ట్యాగ్ కలిగి నవి మూల విత్తనం. నీలిరంగు, తెల్లట్యాగ్ ఉంటే ధృవీ కరణ చేసిన అధికారి సంతకం చేసి ఉంటుంది. ఏ ప్రాంతానికి ఏ కాలానికి అనువైనవి, ఆమోదించిన జీఈఏసీ నెంబరును చూసుకోవాలి.



వెల్దిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు సర్కారు అండ: కడియం

రఘునాథపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలవడమే సర్కారు ధ్యేయమని, ధాన్యంకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఖిలాషాపూర్, మంగలిబండ, జాఫరగూడెం, వెల్ది గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించి మద్దతు ధర పొందాలని, ఎ-గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కాకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటే క్వింటాకు రూ.500 బోనస్ కూడా రైతుల ఖాతాల్లో వారం రోజుల లోపే జమ కానున్నాయన్నారు. రెండో పంట యాసంగికి ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందించడం తన బాధ్యతన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, డీఆర్డీవో వసంత, జిల్లా వ్యవసాయాధికారి అంబిక సోని, జనగామ ఆర్డీవో గోపిరాం, ఏడీఏ సుగుణ, లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, లింగాజీ, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు ఎండి.బాషు మియా, పర్శ సిద్దేశ్, రమేష్, బంద కుమార్, ఐకేపీ ఏపీఎం ఎల్లస్వామి తహసీల్దార్ వంశీకిషోర్, ఏవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా లభించిన ఆర్థికసాయంతో కోమల్ల గ్రామ మహిళ స్వయం సహాయక సంఘం సభ్యురాలు రేణుక ఏర్పాటు చేసుకున్న వనిత టీ స్టాల్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అంతకుముందు ఇందిరమ్మ పథకంలో నిర్మించుకనే మోడల్ ఇంటిని మండల కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి



శివునిపల్లి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి అలవాట్లు, క్రమ శిక్షణ కలిసి సన్మార్గంలో నడవాలని ఎస్‌ఐ మనీష సూచించారు. బుధవారం శివునిపల్లి పట్టణ హైస్కూల్‌లో కెరీర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, డ్రగ్స్ అవగాహన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. మంచి అలవాట్లతో ఉన్నత స్థానానికి ఎదగవచ్చన్నారు. చెడు అలవాట్లతో అర్ధాంతరంగా బతుకులు ముగిసే అవకాశం ఉందన్నారు. మద్య, ధూమ పానం, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం కె.రమేశ్, ఉపాధ్యాయులుకె.ప్రవీణ్‌కుమార్, టి.శ్రీనికాంత్, టి.లక్ష్మీప్రసాద్, టి.శ్రీనాథ్, ఎం.యాదగిరి, ఎం.వసంతకుమారి, ఇ.రమేష్, జి.ఫకీర్‌దాస్, రాధాకృష్ణ, సర్వర్ పాష, నళినీబాయి, కె.రజని, కె.ఉమారాణి, జ్యోతి జానకి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

చిలుపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పల్లగుట్ట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధులు ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. బుధవారం పాఠశాలను సందర్శించిన సంస్థ మేనేజర్ అరవింద్, సభ్యుడు మల్లిఖార్జున్‌లు విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తాము ఉచితంగా అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం యల్లంభట్ల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్‌రావు, రమేష్, అలకనంద, శోభారాణి, కోమలి, దేవ్‌సింగ్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జనగామ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జనగామలోని ఆయుష్మాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిషియన్ డాక్టర్ అభిలాష్ ఆధ్వర్యంలో ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలి పారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేష్ మాట్లాడుతూ ఇకముందు కూడా ఇలాంటి సేవలు ప్రజలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి: కడియం

(5వ పేజీ తరువాయి)

భక్తులు జీడిగుండం, పాలగుండం వద్దకు వెళ్లేందుకు వీలుగా గుట్టపైకి మెట్ల నిర్మాణం, భక్తులకు ప్రమాదం జరగకుండా గుం డాల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం, హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం బయోటాయిలెట్ల నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ముఖద్వారానికి ఎదురుగా సెం ట్రల్ లైటింగ్ వరుసలో నీడ మొక్కలను నాటేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. దేవస్థాన అభివృద్ధి కోసం దా తలు ముందుకు రావాలని కోరారు. ఈసందర్భంగా అవినాష్ అనే భక్తుడు రూ.లక్ష దేవస్థానం అభివృద్ధికి విరాళం ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ 15రోజులపాటు జరిగే వేడుకల్లో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఆర్డీవో గోపిరాంను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఫైర్ ఇంజ న్‌ల ఏర్పాటు, అంబులెన్స్ ఏర్పాటు, పోలీస్ క్యాంపు ఏర్పాట్లను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, డీఎంహెచ్‌వో మల్లికార్జున్, డీపీవో స్వరూప, విద్యుత్ శాఖ ఏడీఈ అనిల్‌కుమార్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ వేణుగోపాల్, మిషన్‌భగీరథ ఈఈ శ్రీకాంత్, ఆలయ ఈవో వంశీ, చైర్మన్ మూ ర్తి, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, కొల్లూరు శివకుమార్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రఘురామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌ఏ -1 పరీక్షలకు సిద్ధం

- రేపటి నుంచి అన్ని పాఠశాలల్లో ప్రారంభం
- 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నిర్వహణ



స్టేషన్‌ఘన్‌పూర్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 24 నుంచి 30 వరకు అన్ని సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) 1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు కూడా డీఈవో ఆధ్వర్యంలో మండల రిసోర్స్ సెంటర్లకు పంపిణీ చేశారు. వాటిని పాఠశాలలకు చేరవేయడానికి సీఆర్‌పీలు ఏర్పాట్లు చేశారు. ప్రశ్నపత్రాల బండిళ్లను హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఒకే షెడ్యూల్ ప్రకారం ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ఇదీ పరీక్షల షెడ్యూల్...

1 నుంచి 6, 8, 10 తరగతులకు ఉదయం పరీక్ష ఉంటుంది. అలాగే, 7, 9 తరగతులకు మధ్యాహ్నం పరీక్షలుంటాయి. 1 నుంచి 10వ తరగతి వరకు జరిగే ఈ పరీక్షలు ప్రాథమిక పాఠశాలలకు, హైస్కూళ్లకు వేరు వేరు సమయాల్లో నిర్వహిస్తారు. 1 నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 8, 10 తరగతులకు ఉదయం 9.15 నుంచి 12.15 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. 7, 9 తరగతులకు మధ్యాహ్నం పరీక్ష నిర్వహిస్తారు. 7వ తరగతికి మధ్యాహ్నం 1.15 నుంచి 4 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు 1.15 గంటల నుంచి 4.15 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

నవంబరు 3న ఫలితాలు

ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరీక్షల జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంటుంది. నవంబరు 3వ తేదీ వరకు 1 నుంచి 10వ తరగతుల పరీక్షల ఫలితాలను ప్రకటించాలని నిర్దేశించారు. 4న మార్కులను రిజిస్టర్లలో నమోదు చేసి యాప్‌లో నమోదు చేయాలి. 15న పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం)లో ఎస్‌ఏ-1 పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉంటుంది.

పరీక్షలు ఇలా...

- 24న 6, 7 తరగతులకు ప్రథమ భాష తెలుగు/ఉర్దూ, 8, 9, 10 తరగతుల గణితం
- 25న 6,7 తరగతులకు హిందీ 8,9,10 తరగతులకు భౌతిక శాస్త్రం
- 27న 1 నుంచి 5 తరగతులకు తెలుగు, 6,7 తరగతులకు తృతీయ భాష ఇంగ్లీష్, 8,9,10 తరగతులకు జీవశాస్త్రం
- 28న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీష్, 6,7,8,9,10 తరగతులకు సాంఘిక శాస్త్రం
- 29న 1 నుంచి 5 తరగతులకు గణితం, 6, 7 తరగతులకు గణితం, 8,9,10 తరగతులకు ప్రథమ భాష తెలుగు/ఉర్దూ
- 30న 1 నుంచి 5 తరగతులకు ఈవీఎస్, 6,7 తరగతులకు సామాన్య శాస్త్రం, 8,9,10 తరగతులకు ద్వితీయ భాష హిందీ/ తెలుగు
- 31న 8,9,10 తరగతులకు తృతీయ భాష ఇంగ్లీష్

ఆడంబరాలకు పోయి అప్పులపాలు కావొద్దు: కలెక్టర్



బండ్లగూడెంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లింగాలఘణపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆడంబరాలకు పోయి నిర్దేశిత కొలతలకంటే అధిక విస్తీర్ణంతో ఇంటి నిర్మాణం చేసి అప్పులపాలు కావొద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. బుధవారం బండ్లగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అధికారులు సూచించిన కొలతలకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు కడితే ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోవని అప్పుడు అప్పులు చేయాల్సి వస్తుందని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెంట తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంతోషిమాత ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి



ఎంఆర్‌సీలో మాట్లాడుతున్న ఎంఈవో కొమురయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో జి.కొమురయ్య సూచించారు. బుధవారం మండలంలోని పీఎస్, యూపీఎస్ హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడారు. ఎఫ్ఎల్ ఎన్, లిప్, లైబ్రరీ, దిక్సూచి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో ఉపాధ్యాయ సమావేశాలు

స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి హైస్కూళ్లతోపాటు పలు పాఠశా లల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు పదవ తరగతిలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల సమావేశాలు హెచ్‌ఎంల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి మైక్రో లెవల్ టీచింగ్‌తోపాటు స్లిప్ టెస్టులు, వీక్లీ టెస్ట్‌లు, మంత్లీ టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. సమావేశాల్లో ఎంఈవో జి.కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కె.రమేశ్, ఎం.సంపత్, డాక్టర్ ఎ.వేణు గోపాల్ రెడ్డి, బి.రఘూజీ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు పకడ్బందీగా చేపట్టాలి



మల్కాపూర్ రికార్డులను పరిశీలిస్తున్న మురళీధర్‌రావు

చిలుపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పశువులకు చేపట్టిన గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ రావు తెలిపారు. బుధవారం రాజ వరంలో చేపట్టిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అంతకుముందు మల్కాపూర్ పశు వైద్యశాలలో రికార్డులను పరిశీ లించారు. ఈసందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ సీజనల్ గా సంక్రమించే వ్యాధులతో గొల్లకురుమలు, పాడి రైతులు అప్ర మత్తంగా ఉండాలని, రోగాలు సోకినట్లు గుర్తిస్తే తక్షణమే సమీ పంలో ఉన్న పశు వైద్య సిబ్బందిని సం ప్రదించాలని సూచించా రు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధి కారి డాక్టర్ అనేశ్, సిబ్బంది సుధాకర్, ఫయాజ్, మోయిన్‌పాషా, సదానందం, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.



ఆశ్వితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం

రఘునాథపల్లి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న మండల కేంద్రానికి చెందిన నేముల ఆశ్విత మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం రఘునాథపల్లికి వచ్చిన అశ్వితను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అశ్విత మాట్లాడుతూ ఉత్తమ ఆశయాన్ని ఎంచుకొని పట్టుదలతో కష్టపడి చదివితే సాధ్యం కానిది ఏది ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, ఉపాధ్యాయులు బాల్నే నాగభూషణం, రాములు, రవిందర్, లక్ష్మీ, లావణ్య, జయంతి, రేణుక, శ్రీలత, పద్మావతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీపై నమ్మకాన్ని పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలు వివరిస్తూ, పార్టీపై నమ్మకాన్ని పెంచేలా చూడాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల మండలాల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వాస్తవాలను వివరించాలన్నారు. పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





పెద్దతండా (బీ)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ, ఇప్పగూడెంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్య

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు ఉపయోగించుకోవాలని పాలకుర్తి చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్యా మంజుల సూచించారు. బుధవారం పెద్దతండా(బీ), బీక్యానాయక్ పెద్దతండా, పెద్దతండా(కే) గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరిగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ సర్పంచులు వాలూనాయక్, ఎండి. సలీం, మదార్, మజ్జిగ శ్రీశైలం, రవి ఉన్నారు.

- లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి): రామచంద్రగూడెం, జీడికల్, సిరిపురం, నాగారం, కళ్లెం, మాణిక్యాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్ ప్రారంభించారు. అలాగే వనపర్తిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో రఘురామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్లు నీలం మోహన్ పాల్గొన్నారు.
- స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, మద్దతు ధరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్యరెడ్డి సూచించారు. బుధవారం ఇప్పగూడెంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మందపురం అనిల్‌గౌడ్, గొడుగు రాజు, మంద రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్యగౌడ్, బాస్కుల కిరణ్, వంగపండ్ల మహేందర్, సట్ల వెంకటరమణ, ప్రకాశ్ రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, క్రిష్ణమూర్తి, అంజి, యాకలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.



పాలకుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ

పాలకుర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మండల కేంద్రంలో పోలీసులు, విద్యార్థులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరుల త్యాగాలు గుర్తు చేసుకొని అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐ జానకిరాంరెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణలో విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ఎప్పటికి మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్, దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాపాస్ యాప్‌తో ఇబ్బందులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

జఫర్‌గడ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాపాస్ కిసాన్ యాప్‌తో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యాప్‌తో నిమిత్తం లేకుండా సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. బుధవారం జఫర్‌గడ్‌లో సంఘం మండల ప్రతినిధులతో కలిసి ఆయన రాష్ట్ర రైతు సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సోమయ్య మాట్లాడుతూ కాపాస్ యాప్‌లో సాంకేతిక లోపాలు, డబ్బుల చెల్లింపుల్లో ఆలస్యం, డేటా తప్పులు, పత్తి నాణ్యత నమోదులో తప్పులు, ఓటీపీ, ఇంటర్నెట్ వంటి సమస్యలతో పత్తి రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. ఈ యాప్‌లో సాంకేతిక లోపాలను తక్షణమే సరి చేసి, తెలుగు భాషలో కూడా అందుబాటులోకి తేవాలన్నారు. 25న జనగామలో నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర స్థాయి సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు రాయపురం భిక్షపతి, ప్రతినిధులు నల్లతీగల శ్రీను, కాట సుధాకర్, నర్సింహ, మంచాల కుమార్, ఎస్‌కె. మున్నా, బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యంతో తిప్పలు



పాలకుర్తిలో ప్రధాన రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

పాలకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరికోతలు ఊపందుకున్నాయి. దీంతో రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకుం టున్నారు. మండల కేంద్రంలోని పాలకుర్తి, జనగామ ప్రధాన రహదారి ఆరబోస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యంపై రాకుండా రాళ్లు పెట్టడంతో ప్రమా దాలు జరుగుతున్నాయి. గత ఏడాది బమ్మెరలో, గత రెండేళ్ల క్రితం కొండాపురం వద్ద మోటార్ సైకిల్‌పై నుంచి పడి తీవ్రగాయాలై మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి.